సాక్షి వరంగల్

శుక్రవారం । 17 । మార్చి । 2023



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు.

- 8లో▸



అధికారులు వర్సెస్ వ్యాపారులు

ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు.

- 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$30^0/20^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పీడ్ పోస్టులో రామయ్య తలంబ్రాలు



నర్సంపేట: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగే సీతారాముల కల్యాణానికి సంబంధించిన తలంబ్రాలు స్పీడ్ పోస్టు ద్వారా ఇళ్లకు అందించడానికి తపాలా శాఖ సన్నాహాలు చేసిందని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని పోస్టాఫీస్‌లో గురువారం స్పీడ్ పోస్టు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాలయ అర్చన కల్యాణ తలంబ్రాలు రూ.450, ముత్యాల తలంబ్రాలు రూ.150 చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టు మాస్టర్ దార్ల రాజేందర్, పోస్టల్ సిబ్బంది అశోక్, సురేశ్, సంపత్, శ్రీకాంత్, పరశురాం, షాబుద్దీన్, కృష్ణకిశోర్, అనూష, లావణ్య, రవళి, రవి తదితరులు పాల్గొన్నారు.

సెకండియర్ పరీక్షకు 309 మంది గైర్హాజరు

● ఒకరి డీబార్

కాళోజీ సెంటర్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమైనట్లు డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. ఓ కేంద్రంలో కాపీ కొడుతున్న విద్యార్థిని డీబార్ చేసినట్లు చెప్పారు. జిల్లాలోని పరీక్ష కేంద్రాల్లో 6,791 మంది విద్యార్థులకు.. 6,482 మంది హాజరయ్యారని, 309 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జనరల్ కోర్సుల్లో 5,965 మంది కాగా.. 255 మంది గైర్హజరయ్యారని. ఒకేషనల్ కోర్సుల్లో 826 మంది కాగా.. 54 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే వరంగల్ ధ్రువ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా.. ఓ విద్యార్థి సెల్ ఫోన్ ద్వారా కాపీ కొడుతున్నట్లు గుర్తించి డీబార్ చేసినట్లు తెలిపారు.

పనులు పరిశీలించిన డీఆర్‌డీఓ



గీసుకొండ: మండలంలోని ఊకల్, మచ్చాపూర్ గ్రామాల్లో చేపడుతున్న పలు పనులను డీఆర్‌డీఓ సంపత్‌రావు గురువారం పరిశీలించారు. ఊకల్‌లో ఫీడర్ కాల్వ పూడికతీత, నర్సరీ, పంచాయతీ నిర్మాణ పనులను పరిశీలించి.. త్వరగా పూర్తి చేయాలన్నారు. మచ్చాపూర్ నర్సరీలో మొక్కల పెంపకం బాగుందని సిబ్బందిని అభినందించారు. రెండు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు అధికంగా పనులు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరేశం, ఎంపీఓ ప్రభాకర్, ఏపీఓ చంద్రకాంత్, సర్పంచ్‌లు బోడకుంట్ల ప్రకాశ్, మొగసాని నాగదేవత, ఎంపీటీసీ వీరారావు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్‌లో రాజుకు సిల్వర్ మెడల్



చెన్నారావుపేట: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో ఈనెల 15న జరిగిన రాష్ట్ర వీల్ చైర్ పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన కొరె రాజు పాల్గొని సిల్వర్ మెడల్ సాధించాడు. పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా వారు పోటీలు నిర్వహించగా.. సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ ఎస్‌ఎస్‌బీ తరఫున రాజు పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు లక్నోలో జరిగే నేషనల్ పారా బ్యాడ్మింటన్ పోటీలకు రాజు ఎంపికయ్యాడు. కాగా.. రాజును మిత్రులు బొనగాల శ్రీనివాస్, గొస్కుల వీరన్న, అడప సురేశ్, ననుమాస అనిల్, ప్రసన్న, కుమారస్వామి తదితరులు గురువారం అభినందించారు.

అప్పగింతకు అడ్డెవరు

డీఎస్‌ఏకు అప్పగించని పంచాయతీరాజ్ శాఖ

- జేఎన్‌ఎస్‌లో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ పూర్తయి ఏడాదిన్నర
- కాంట్రాక్టర్ గుప్పిట్లోనే అథ్లెటిక్ ట్రాక్
- నేటికీ అధికారిక ప్రారంభానికి నోచుకోని వైనం
- నిర్వహణ లేక నిర్వీర్యమవుతున్న ట్రాక్



కేంద్ర ప్రభుత్వ నిధులతో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్‌ఎస్)లో నిర్మించిన సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ పూర్తయి ఏడాదిన్నర దాటినా ఇంకా కాంట్రాక్టర్ గుప్పిట్లోనే ఉంది. ట్రాక్ నిర్మాణ పనులకు సారథ్యం వహించిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు క్రీడా ప్రాధికార సంస్థకు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడమే కారణంగా తెలుస్తోంది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన సింథటిక్ ట్రాక్ అధికారుల అలసత్వంతో అధికారిక ప్రారంభానికి నోచుకోవడం లేదు. నిర్వహణ లేక ట్రాక్ నిర్వీర్యం అవుతోందని అథ్లెట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వరంగల్ స్పోర్ట్స్

ఖేలో ఇండియా పథకం ద్వారా..

ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెట్ల కోసం కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియా పథకం ద్వారా 2018, మార్చి 21న రూ.7కోట్లు కేటాయించింది. హనుమకొండలోని జేఎన్‌ఎస్‌లో కేంద్ర బృందం పరిశీలించి ట్రాక్ నిర్మాణానికి సుముఖత తెలిపింది. నిర్మాణ పనులను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించడంతో ఆ బాధ్యతలను పంచాయతీరాజ్ శాఖకు కేటాయించారు. పీఆర్ ఇంజనీరింగ్ చీఫ్, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వీసీ, ఎండీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. పంచాయతీరాజ్ శాఖ పిలిచిన టెండర్ల ద్వారా 2019, ఆగస్టు 26న నిర్మాణ పనులను శివనరేష్ అనే సంస్థ దక్కించుకుంది. సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్‌తోపాటు క్రీడాకారులు దుస్తులు మార్చుకునేందుకు భవనం నిర్మించాలి. పనులను దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ సెప్టెంబర్ 2021న పూర్తయినట్లు తెలిపింది. కానీ అధికారికంగా ప్రారంభించలేదు. అయినా కేంద్ర క్రీడా శాఖ ప్రత్యేక అనుమతితో 2021, సెప్టెంబర్ 15 నుంచి 19వ తేదీ వరకు నేషనల్ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌ను అట్టహాసంగా నిర్వహించారు.

ఏడాదిన్నరగా ఎదురుచూపులు?

సింథటిక్ ట్రాక్ పనులు పూర్తయి ఏడాదిన్నర కాలం గడుస్తున్నా పంచాయతీరాజ్ అధికారులు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ)కు కంప్లీషన్ లెటర్ ఇవ్వలేదు. ట్రాక్‌ను అప్పగించాలని డీఎస్‌ఏ కొద్దిరోజుల క్రితం లిఖితపూర్వకంగా పంచాయతీరాజ్ శాఖ అధికారులను కోరింది. పీఆర్ అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో చేసేదేమీలేక డీఎస్‌ఏ మిన్నకుండిపోయింది.

ఆలస్యం చేస్తే ఎవరికి లాభం?

క్వాలిటీ కంట్రోల్ నివేదిక ఎంత ఆలస్యమైతే కాంట్రాక్టర్‌కు అంత సహకరించినట్లేనని సీనియర్ క్రీడాకారులు చెబుతున్నారు. కాంట్రాక్టర్‌కు ఇచ్చిన గడువులోపు ట్రాక్ పాడయితే పునరుద్ధరించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పైనే ఉంటుందని, అందుకే ఆలస్యం చేసి గడువు ముగిశాక డీఎస్‌ఏకు అప్పగిస్తే నాణ్యతకు కాంట్రాక్టర్‌కు సంబంధం ఉండదనే నిబంధనలు ఉన్నాయి. అప్పగించకపోవడానికి ఈ కారణాలు కూడా అయి ఉండొచ్చని భావిస్తున్నారు. కాగా.. కాంట్రాక్ట్ సంస్థకు రూ.7 కోట్లకు.. రూ.3.50కోట్లను మాత్రమే చెల్లించిందని, మిగిలిన రూ.3.50 కోట్లు ఇవ్వకపోవడం వల్లనే కంప్లీషన్ లెటర్ ఇవ్వడం లేదని సదరు కాంట్రాక్ట్ సంస్థ వ్యక్తులు డీఎస్‌ఏలో చెప్పినట్లు తెలిసింది.

క్వాలిటీ కంట్రోల్ తనిఖీ చేయాల్సి ఉంది..

ట్రాక్, భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ శాఖ చీఫ్ ఇంజనీరింగ్ విభాగం నుంచి క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. వారు చేసిన వెంటనే కంప్లీషన్ రిపోర్టును డీఎస్‌ఏకు అందజేస్తాం. ఈ పనులు వారం రోజుల్లో పూర్తవుతాయి.

- శంకరయ్య, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

పంచాయతీరాజ్ శాఖకు లెటర్ రాశాం..

సింథటిక్ ట్రాక్ అప్పగింతపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు పీఆర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు లేఖ రాశాం. మరో వారం రోజుల్లో అప్పగిస్తామని చెప్పారు. కంప్లీషన్ రిపోర్టు అందగానే ప్రారంభించాలని 'సాట్' నిర్ణయించింది.

- అశోక్‌కుమార్, జిల్లా యువజన, క్రీడల అధికారి, హనుమకొండ

ట్రాక్ నాణ్యత బయటపడుతుందనే..



ట్రాక్ నాణ్యతా లోపాలు బయటపడతాయనే కంప్లీషన్, క్వాలిటీ నివేదికను అందజేయడం లేదని అర్థమవుతోంది. ఏడాదిన్నరగా నిర్వహణ లేకపోవడం వల్ల ఇప్పటికే సింథటిక్ ట్రాక్ దెబ్బతిని ఉంటుంది. కేంద్రం ప్రత్యేక ఇంజనీరింగ్ బృందంతో పరిశీలించాలి.

- మంచిక వినయ్‌గౌడ్, సాఫ్ట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు, గోపాల్‌పూర్

కలెక్టరేట్ నిర్మాణానికి స్థలం అప్పగింత



ఆజంజాహి మిల్లు స్థలం అప్పగింత పత్రాలతో రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు

వరంగల్: వరంగల్ కలెక్టరేట్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. లక్ష్మీపురంలోని ఆజంజాహి మిల్లు భూముల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) నిర్మించేందుకు వివిధ సర్వే నంబర్లలోని 20 ఎకరాల 32 గుంటల భూమిని అప్పగించేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ గత నెల 9న జీఓ నం.38 జారీ చేసిన విషయం విదితమే. దీంతో గురువారం చేనేత, జౌళి శాఖ అధికారులు.. వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు సత్యపాల్‌రెడ్డి, ఫణికుమార్‌లకు ఆ భూమిని అప్పగించారు. వెంటనే ఆ స్థలాన్ని ఆర్‌అండ్‌బీ అధికారులకు రెవెన్యూ అధికారులు అప్పగిస్తూ డాక్యుమెంట్లు అందించారు. ఈ స్థలంలో కలెక్టరేట్‌తోపాటు ఆయన నివాస గృహం, వివిధ శాఖల జిల్లా కార్యాలయాలు, సీఎం బస కోసం ప్రత్యేకంగా అతిథి గృహం, సమీక్షా సమావేశాల కోసం సమావేశ మందిరాలు నిర్మించనున్నట్లు తెలిసింది. వీటితోపాటు హెలిప్యాడ్ కూడా నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. సుమారు రూ.100కోట్ల వ్యయంతో సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం నిర్మించనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో చేనేత, జౌళి, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సీపీఎం బహిరంగ సభ

వరంగల్: వరంగల్‌లోని ఆజంజాహి మిల్లు మైదానంలో శుక్రవారం సీపీఎం బహిరంగ సభ జరగనుంది. ఈ మేరకు సభ ఏర్పాట్లను ఆ పార్టీ నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ముక్కెర రామస్వామి మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సభలో ఆల్ ఇండియా కార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు బాబు, ముక్కెర రామస్వామి, భుక్యా సమ్మయ్య, కుమారస్వామి, హనుమకొండ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు బారెడు.. సిబ్బంది మూరెడు

వామ్మో.. ఏనుమాముల పోలీస్‌స్టేషన్

- ఉండాల్సిన సిబ్బంది 68 మంది.. ఉన్నవారు 21 మంది
- రోజూ చికాకు ఘటనలు.. ఉన్న వారిపై తీవ్ర ఒత్తిడి
- పీఎస్‌కు వచ్చేందుకు జంకుతున్న అధికారులు



ఏనుమాముల పోలీస్‌స్టేషన్

వరంగల్: వరంగల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో పోస్టింగ్ అంటేనే అధికారులు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. శివారు ప్రాంతాలు దీని పరిధిలో ఉండడం, సిబ్బంది పూర్తిస్థాయిలో లేకపోవడం.. రోజూ చికాకు ఘటనలు చోటుచేసుకుంటుండడంతో స్టేషన్‌కు వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నట్లు ఆ శాఖలోని వారే అంటున్నారు. గ్రేటర్ వరంగల్‌లోని 3, 14 డివిజన్లకు చెందిన ప్రాంతాలు గతంలో ఇంతేజార్‌గంజ్, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉండేవి. వీటి పరిధిలోని గ్రామాలన్నింటినీ కొత్తగా ఏర్పాటు చేసిన ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి తెచ్చారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ సమీపంలో దీనిని ఏర్పాటు చేసి 2022, డిసెంబర్ 21న ప్రారంభించారు. ప్రారంభ సమయంలో ఇన్‌స్పెక్టర్ (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా చేరాలు, ఎస్‌ఐలుగా పోగుల శ్రీకాంత్, రాజన్‌బాబులతోపాటు కొంత మంది సిబ్బందిని కేటాయించారు.

అరకొర సిబ్బందితో అవస్థలు

స్టేషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం కేడర్ స్ట్రెంత్ నియామకాలను సైతం ఆదేశాల్లో పేర్కొంది. ఉత్తర్వుల ప్రకారం స్టేషన్‌లో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఏఎస్‌ఐలు, పది మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 45 మంది కానిస్టేబుళ్లు, ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లను కలిపి మొత్తం 68 మంది అధికారులు, సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రారంభ సమయంలో ఒక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఎస్‌ఐ, నలుగురు ఏఎస్‌ఐలు, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, ఎనిమిది మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లను నియమించారు. వారితోనే స్టేషన్ నిర్వహణ సాగుతోంది. స్టేషన్ ప్రారంభం నాటి నుంచి ఇప్పటివరకు 70కి పైగా ఫిర్యాదులు రావడంతో కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఇవి కాకుండా చిన్న చిన్న కేసులు మరో 50కిపైగా రావడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసింది.

శివారుతో చికాకు...

- ఆరెపల్లి ప్రధాన రహదారితోపాటు ఈ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలు నగర శివారు ప్రాంతాలు కావడంతో భూముల క్రయ, విక్రయాలతోపాటు అసైన్డ్ భూముల దందాలు ఎక్కువగా జరుగుతాయి.
- లేబర్ ఎక్కువగా ఉండడం వల్ల తరచూ గొడవలు జరుగుతుంటాయి. దీనికితోడు మహిళల వేధింపుల కేసులు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఈ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలంటే క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి. ఇందుకు సరిపడా సిబ్బంది లేకపోవడం వల్ల ఆలస్యం అవుతున్నట్లు తెలిసింది.
- దాదాపు ఖాళీగా ఉన్న ప్రతి ప్లాటు ఏదో ఒక లిటిగేషన్ ఉండడంతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, ఒప్పందాలు కుదరకపోతే సదరు పంచాయితీలు అన్ని పోలీస్‌స్టేషన్‌కు వస్తున్నాయి.
- రాత్రివేళ ఈ ప్రాంతాల్లో గస్తీ నిర్వహించాలంటే పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటేనే సాధ్యం.
- పనిభారం వల్ల ఇప్పుడున్న వారు సైతం ఏదైనా సాకు చూపి సెలవులో వెళ్లాలన్న ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం.
- ఇప్పటికైనా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

పరిహారం అందలే..

వడగళ్లతో పంట నష్టపోయి ఏడాదైనా అందని నష్టపరిహారం

- రైతుల పక్షాన ఆందోళనలకు దిగిన ప్రతిపక్షాలు
- జీఓ విడుదలై మూడు నెలలైనా అతీగతి లేదు..



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు రాణాప్రతాప్‌రెడ్డి తదితరులు



వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందిస్తామని భరోసా ఇస్తున్న మంత్రుల బృందం(ఫైల్)

నర్సంపేట: మంచి వర్షాలు పంటలకు అనువుగా ఉంటాయని సాగు రైతులు మురిసిపోయారు. మిర్చి, మొక్కజొన్న పంట ఏపుగా వస్తుందని.. వచ్చిన దిగుబడిని అమ్మి అప్పులు తీర్చుకోవచ్చని ఆనందపడ్డారు. ఇంతలోనే పగబట్టినట్లు వడగళ్ల వర్షం పంటలపై ప్రతాపం చూపింది. చేతికొచ్చే పంటలను నాశనం చేసి.. రైతులను కోలుకోకుండా చేసింది. దెబ్బతిన్న పంటలను.. రైతుల కన్నీళ్లను చూసిన ప్రతిపక్షాలు పరిహారం అందించాలని ఆందోళనలకు దిగాయి. వడగళ్ల వానతో నష్టపోయిన పంటలను పరిశీలించిన మంత్రుల బృందం పరిహారం అందిస్తామని రైతులకు భరోసా ఇచ్చింది. ఇదంతా జరిగి ఏడాది గడిచింది. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నం.42 ద్వారా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని చెప్పి మూడు నెలల కావస్తోంది. అయినా ఎదురుచూపులే తప్ప చిల్లిగవ్వ కూడా అందని పరిస్థితి. జిల్లాలో గత ఏడాది జనవరి నెలలో కురిసిన భారీ వడగళ్ల వానతో మిర్చి, మొక్కజొన్న పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంటలకు ఎక్కువగా నర్సంపేట నియోజకవర్గంలో భారీ నష్టం వాటిల్లింది. నష్టపోయిన రైతులను కలిసి ఓదార్చడంతోపాటు పంటలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి మంత్రుల బృందాన్ని ప్రత్యేకంగా పంపించి పరిహారం అందిస్తామని హామీ ఇప్పించారు. రైతులు నష్టపోయిన పంటకు పరిహారం అందించేందుకు సంబంధిత అధికారులచే ప్రభుత్వం నివేదిక కూడా తీసుకుంది. డిసెంబర్ 22న ప్రత్యేక జీఓ 42 ద్వారా 12,565 మంది మిర్చి రైతులకు సంబంధించి 13,030 ఎకరాల విస్తీర్ణంలో నష్టపోయిన వారికి ఎకరాకు రూ.5,100 చొప్పున, మొక్కజొన్న రైతులకు ఎకరాకు రూ.3,333 చొప్పున పరిహారం విడుదల చేసినట్లు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో సైతం వెల్లడించారు. అయితే మూడు నెలలు కావస్తున్నా పరిహారం రైతులకు అందలేదు.



వడగళ్లతో నేలవాలిన మొక్కజొన్న పంట(ఫైల్)

త్వరలోనే అందిస్తాం.. : పాలక పక్షం

వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులందరికి త్వరలోనే పరిహారం అందిస్తామని పాలక పక్షం చెప్పుకుంటూ వస్తోంది. నియోజకవర్గంలోని నల్ల బెల్లి మండల సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న త్వరలోనే పంట నష్టపరిహారం అందిస్తామని వెల్ల డించారు. దీనికి సంబంధించి చెక్కులు కూడా సిద్ధం చేశామని, ప్రభుత్వం విడుదల చేసిన పరిహారం ప్రకారం రైతులందరికి రెండు, మూడు రోజుల్లో పరిహారం అందుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ఆందోళన బాటలో ప్రతిపక్షాలు

వడగళ్ల వానతో నష్టపోయిన మిర్చి, మొక్కజొన్న రైతులకు పరిహారం విడుదలైనా అందించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. ఇందులో భాగంగా నల్లబెల్లి మండలంలోని హైవేపై కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేయగా.. బీజేపీ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందించారు. పంట నష్టపరిహారం డబ్బులు రూ.9కోట్లు కలెక్టర్ అకౌంట్‌లో జమ అయినా.. రైతులకు ఎందుకు అందించడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సంతోష్‌కు నాలుగు ఉద్యోగాలు!



సంతోష్

వరంగల్ (పర్వతగిరి): ప్రభుత్వ కొలువు సాధించాలంటే ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అలాంటిది.. ఇటీవల కాలంలో నిర్వహించిన నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు మండల కేంద్రానికి చెందిన కంటెం సంతోష్ ఎంపికయ్యాడు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో ఆఫీస్ స్కేల్-1, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంక్ క్లర్క్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో జూనియర్ అసోసియేట్, వరంగల్ డీసీసీబీలో క్లర్క్ పోస్టులు సాధించాడు. కాగా.. నాలుగు ఉద్యోగాలకు ఎంపికైన సంతోష్‌ను గ్రామస్తులు గురువారం అభినందించారు.

సాయమే బతికిస్తుంది..

స్తంభాలవారీగా తనిఖీలు చేపట్టాలి

19న స్కాలర్‌షిప్ ఎంపికలు

- వివరాలు 10లో▸

ప్రశ్న పత్రం లీకేజీపై విచారణ చేపట్టాలి



అదనపు కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న నాయకులు

వరంగల్ రూరల్: టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన ఏఈ ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఏఐఎస్‌బీ రాష్ట్ర అధ్యక్షుడు హకీమ్ నవీద్ అదనపు కలెక్టర్ శ్రీవత్సను కలెక్టరేట్‌లో కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ పేపర్ లీకేజీ వ్యవహారంలో ప్రవీణ్‌కుమార్‌తోపాటు టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సెక్రటరీ హస్తం కూడా ఉంటుందని అభిప్రాయపడ్డారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం గ్రేటర్ నాయకులు రోహిత్, సహబాజ్, శ్రీనివాస్, జుబేర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీవత్స, పక్కన డీఈఓ వాసంతి

● అదనపు కలెక్టర్ శ్రీవత్స

కాళోజీ సెంటర్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్ష ఏర్పాట్లపై గురువారం వరంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సన్నద్ధత సమావేశం డీఈఓ వాసంతి అధ్యక్షతన నిర్వహించారు. పరీక్ష నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీవత్స మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఈఓ వాసంతి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరీక్షలకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో 56 పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతోపాటు రూట్ ఆఫీసర్లు, ఎంఈఓలు పాల్గొన్నారు.

భూ తగాదా కేసులో ఒకరి రిమాండ్

నర్సంపేట రూరల్: భూ తగాదా కేసులో ఒకరు రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట ఎస్సై రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని నాడెం వీరస్వామి మాధన్నపేట పెద్ద కాల్వ సమీపంలో 20 గుంటల భూమి ఉంది. 2018లో అతని కూతురు వివాహం నిమిత్తం ఆ భూమిని నర్సంపేట మండలంలోని ఏనుగల్‌తండాకు చెందిన అనిల్ అనే వ్యక్తి కొనుగోలు చేశాడు. అప్పట్లో రెండు సంవత్సరాలపాటు వీరస్వామి కౌలు చేశాడు. ఈ క్రమంలో నా భూమి హద్దులు మార్చారంటూ అనిల్ పలుమార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి పోలీసు స్టేషన్ చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో అనిల్ పది రోజుల క్రితం నాడెం వీరస్వామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఫిర్యాదు చేశారు. సీపీ రంగనాథ్‌ను ఆదేశాల మేరకు ఈనెల 9న డీసీపీ కర్ణాకర్, నర్సంపేట ఏసీపీ సంపత్‌రావులు ఆ భూమిని పరిశీలించారు. ఈ క్రమంలో వీరస్వామి ఫిర్యాదు మేరకు అనిల్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

కరీమాబాద్‌లో..

ఖిలా వరంగల్: భూ ఆక్రమణకు యత్నించడమే కాకుండా ఓ వ్యక్తిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన దేవర శ్రీనివాస్, రాజేశ్వరి దంపతులు 38 గజాల ఇంటి స్థలాన్ని రూ.5 లక్షలకు పల్లకొండ రమేష్‌కు విక్రయించేందుకు 2021 సెప్టెంబర్ 29న అగ్రిమెంట్ చేసుకున్నారు. రమేష్ నుంచి రూ.1 లక్ష అడ్వాన్స్‌గా తీసుకున్నారు. రెండేళ్ల దాటినా రమేష్ డబ్బులు ఇవ్వకపోగా ఆ స్థలానికి ప్రహరీ నిర్మాణానికి యత్నించాడు. శ్రీనివాస్ అగ్రిమెంట్ ప్రకారం డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న తర్వాతే నిర్మాణం చేపట్టాలని నిలదీశారు. దీంతో ఆగ్రహానికి గురైన రమేష్‌తో పాటు కురాకుల కల్యాణ్, రాయపురం రంజిత్‌లు కలిసి శ్రీనివాస్‌పై కర్రలు, ఇటుక పెళ్లలతో దాడి చేశారు. దీంతో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు గురువారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

ఐదుగురి అరెస్ట్

ప్రైవేట్ వ్యక్తుల భూమిలో జెండాలు పాతి గుడిసెలు వేసేందుకు యత్నించిన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. బాధితులు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

అధికారులు వర్సెస్ మిర్చి వ్యాపారులు

- కమీషన్ లేకుండా కొనుగోలు చేయాలంటున్న అధికారులు
- కుదరదంటున్న వ్యాపారులు
- టెండర్ల ఆలస్యంతో రైతుల పడిగాపులు
- కమీషన్‌తో నష్టపోతున్నామంటూ కర్షకుల ఆవేదన



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు నిలిచిపోవడంతో పడిగాపులు పడుతున్న రైతులు

కేసముద్రం: ఆరుగాలం శ్రమించిన మిర్చి రైతులకు తీరా పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇబ్బందులు తప్పడంలేదు. ఒక పక్క తెగుళ్ల కారణంగా మిర్చి దిగుబడి పడిపోగా, మరో వైపు కమీషన్ పేరా డబ్బులను కటింగ్ చేస్తూ తూకంలో గ్రాముకు లెక్కకట్టకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. వివరాలిలా ఉన్నాయి.. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో ఈ–నామ్ విధానం కింద కొనుగోలు చేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం మార్కెట్‌లో మిర్చి ఖరీదును ప్రారంభించారు. ఆ సమయంలో 3 శాతం కమీషన్‌తోపాటు, గ్రాముల లెక్కకట్టకుండా కొనుగోలు చేసేందుకు రైతు సంఘం, వ్యాపారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. కాని ప్రస్తుతం ఆ గడువు ముగిసినందున ఎలాంటి కమీషన్ లేకుండా తూకంలో గ్రాముల లెక్కతోపాటు, బస్తాకు ఖరీదు కట్టివ్వాలని, ఖరీదు చేసిన రోజునే డబ్బులు చెల్లించాలంటూ పలు రైతు సంఘాల నాయకులు మార్కెట్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువచ్చారు. ఈ మేరకు ఇటీవల వ్యాపారులతో, రైతు సంఘం నాయకులతో మార్కెట్ అధికారులు చర్చలు జరిపారు. మార్కెట్‌లో నిబంధనల ప్రకారం కమీషన్ లేకుండా, తూకంలో గ్రాములకు లెక్కకట్టి డబ్బులు చెల్లించాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం మార్కెట్‌కు మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా, అధికారులు చెప్పినట్లుగా తాము ఖరీదు చేయలేమంటూ వ్యాపారులు చేతులెత్తేశారు. దీంతో మధ్యాహ్నం దాటినప్పటికీ వ్యాపారులు ఖరీదుకు రాకపోవడంతో రైతులు మిర్చి యార్డులో రైతులు పడిగాపులు పడ్డారు. చివరకు రైతులు ఆగ్రహానికి గురై అధికారులను నిలదీశారు.

పాతపద్ధతిలోనే కొనుగోలు..

పాతపద్ధతిలోనే మిర్చి ఖరీదు చేస్తామని వ్యాపారులు చెబుతుండగా మరోవైపు ఈ–నామ్ విధానం కింద ఎలాంటి కమీషన్‌లు లేకుండానే కొనుగోలు చేయాలని, లేకుంటే ఖరీదుకు అంగీకరించమని మార్కెట్ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో మరోమారు చర్చలు జరిగిన తర్వాత తమ నిర్ణయాన్ని చెబుతామంటూ వ్యాపారులు తెలిపారు. ఈ నెల 20 నుంచి కమీషన్ లేకుండా, గ్రాములను సైతం లెక్కకట్టి మిర్చిని ఖరీదు చేయాలని స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. గురువారం మార్కెట్‌కు 723 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా, క్వింటాకు గరిష్ట ధర రూ.23,421లు, కనిష్ట ధర రూ.17,055లు పలికింది. తాలు రకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.14,211లు, కనిష్ట ధర రూ.13,911లు పలికినట్లు అధికారులు తెలిపారు.

కమీషన్‌తో నష్టపోతున్నాం..



ఎకరం భూమిలో మిర్చి పంట సాగు చేశాను. రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. పంటకు తెగుళ్ల సోకడంతో కేవలం 4 క్వింటాళ్ల మిర్చినే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో కమీషన్ లేకుండా కొనమంటూ వ్యాపారులు ఖరీదు చేయడానికి రాలేదు. చివరకు మళ్లీ పాత పద్ధతిలోనే కొనుగోలు చేయడంతో తీవ్రంగా నష్టపోయాం.

-మొగిలి, అర్పనపల్లి, కేసముద్రం మండలం

పాత పద్ధతితోనే కొనుగోలు చేస్తాం..



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి కొనుగోలు ప్రారంభించే సమయంలో 3 శాతం కమీషన్‌తో, తూకంలో 500 గ్రాములకే లెక్కకట్టి ఖరీదు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాం. పాత పద్ధతితోనే మిర్చిని కొనుగోలు చేస్తున్నాం. ఇతర మార్కెట్‌ల్లో మాదిరిగానే తాము ఇక్కడ మిర్చిని ఖరీదు చేస్తున్నాం.

-తోకల శ్రీనివాస్‌రెడ్డి, మిర్చి వ్యాపారి

కమీషన్ లేకుండానే ఖరీదు చేయిస్తాం..



మార్కెట్‌లో ఎలాంటి కమీషన్ లేకుండా, గ్రాములను లెక్కకట్టే విధంగా మిర్చిని ఖరీదు చేయిస్తాం. కొనుగోలు చేసిన రోజునే చెక్కులను ఇచ్చేలా చూస్తాం. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం.

-అమర లింగేశ్వర్‌రావు, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ కేసముద్రం మార్కెట్

రైలునుంచి జారి పడి మహిళ మృతి

శాయంపేట: రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన సంఘటన చర్లపల్లి స్టేషన్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శాయంపేట మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి పుష్‌పుల్ రైలులో చర్లపల్లికి వెళ్తున్నారు. రైలు దిగుతున్న క్రమంలో ప్రభాకర్ భార్య సంధ్య కిందపడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. సంధ్యను కాపాడే ప్రయత్నంలో ప్రభాకర్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సంధ్య మృతితో శాయంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..



మృతి చెందిన సుధాకర్

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని బాంబుల గడ్డ ప్రధాన రాహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాగారం గ్రామానికి చెందిన కొమ్మ సుధాకర్ (30) జిల్లా కేంద్రంలోని బొగ్గు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో బాంబులగడ్డ వద్ద బైక్ అదుపు తప్పి కిందపడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో ఆటో డ్రైవర్లు, ఉన్నతాధికారులతో గురువారం ఆత్మీయ సమావేశం జరిగింది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆటో డ్రైవర్లకు గౌరవం దక్కిందన్నారు. ఆటో డ్రైవర్ల కోసం త్రిచక్ర ఆటో డ్రైవర్స్ పొదుపు, పరపతి సహకార సంఘాన్ని ఏర్పాటు చేయించానని, ప్రస్తుతం రూ.1.50 కోట్ల టర్నోవర్‌తో సహకార సంఘం నడుస్తోందని తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లపై చలాన్ల విధింపును పరిమితం చేస్తామన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో కార్మిక, ఆటో డ్రైవర్ల భవనానికి స్థలాన్ని కేటాయించనున్నట్లు చెప్పారు. వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ నగరంలో మూడు ప్రాంతాల్లో ఆటో స్టాండ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మే 1 న డీసీసీబీ ఆధ్వర్యంలో 100 ఆటోలకు రుణ సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. త్రిచక్ర ఆటో డ్రైవర్స్ పొదుపు, సహకార సంఘం కో ఆర్డినేటర్ ఎన్. రవీందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం, ఆర్టీఓలు వేణు, అఫ్రీన్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం జాస్తి శ్రీలత, కార్మిక శాఖ సహాయక కమిషనర్ కోలా ప్రసాద్, ఆర్డీఓ వాసుచంద్ర, కల్పలత సూపర్ బజార్ చైర్మన్ వర్ధమాన్ జనార్దన్, ఎండీ ఎ.జగన్మోహన్‌రావు పాల్గొన్నారు.



పాల్గొన్న ఆటో డ్రైవర్లు

యువకుడి ఇంటి ఎదుట మహిళ నిరసన

ధర్మసాగర్(వేలేరు): భర్త చనిపోయి ఒంటరిగా ఉంటున్న మహిళను ఓ యువకుడు మాయమాటలు చెప్పి లోబర్చుకొని, ఆమె వద్ద నుంచి సుమారు రూ.15లక్షలు తీసుకుని మొహం చాటేశాడని బాధిత మహిళ నిరసన చేపట్టింది. ఈ ఘటన గురువారం మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ముత్తోజు అజయ్ అనే యువకుడు నాలుగు సంవత్సరాల క్రితం తనకు పరిచయమై మాయమాటలు చెప్పి తనను కొత్తకొండ దేవాలయంలో రెండు సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్నాడు. అప్పటి నుంచి మేమిద్దరం కలిసే ఉంటున్నాం. రూ.15లక్షలతో సొంతంగా ఇళ్లు కూడా నిర్మించుకున్నాం. అజయ్ తన చెల్లి పెళ్లి చేసిన తర్వాత తనను ఇంటికి తీసుకెళ్లి కలిసే ఉంటామని నమ్మించాడు. ప్రస్తుతం ఐదు నెలలుగా తనతో కలిసి ఉండటం లేదని, పది రోజుల క్రితం ఎర్రబెల్లి గ్రామానికి వస్తే తనను అజయ్ తీవ్రంగా కొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. దీంతో ఈనెల 19న సర్పంచ్, పెద్ద మనుషుల ఆధ్వర్యంలో పంచాయితీ నిర్వహించుకుంటామని అజయ్ తెలిపినట్లు ఆమె తెలిపింది. నాలుగు రోజులుగా సైదాపూర్‌లోని తన ఇంటి వద్దకు వచ్చి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపింది. దీంతో ఆయన వేధింపులు భరించలేక గురువారం ఎర్రబెల్లిలోని అజయ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మహిళను అక్కడి నుంచి పంపించారు.



యువకుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళ

వీధికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


- భయాందోళనలో గ్రామస్తులు



కుక్కకాటుకు గురైన కార్తీక్ కాలు భాగం

గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని 3 గ్రామాల్లో గురువారం ఒకేరోజు ముగ్గురిని వీధి కుక్కలు కాటేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కోట్యానాయక్‌తండాకు చెందిన గుగులోత్ కార్తీక్ (6) ఆడుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన కుక్క.. పలుచోట్ల కరవడంతో 3 చోట్ల కాట్లు పడ్డాయి. పెద్ద కిష్టాపురం గ్రామానికి చెందిన 60 సంవత్సరాల వృద్ధురాలు గుగులోత్ భద్రిని కుక్క కాటు వేసింది. ముల్కనూరుకు చెందిన 5 ఏళ్ల బాలుడు బెల్లం దివ్యక్ చక్రవర్తిని వీధి కుక్కలు దాడిచేసి కరిచాయి. వీరందరూ స్థానిక సీహెచ్‌సీలో కుక్కకాటు వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్ హనుమంతరావు తెలిపారు. గ్రామాల్లో వీధికుక్కల బెడద ఎక్కువగా ఉందని, అధికారులు తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కోతుల దాడిలో విద్యార్థికి..



గాయపడిన విద్యార్థి కృతిమ్

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం (ఎం) మండలంలోని పాలంపేట గ్రామంలో గురువారం దేవులపల్లి కృతిమ్(8) అనే బాలుడిపై కోతులు దాడి చేసి గాయపర్చింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒక పూట బడులు కావడంతో దేవులపల్లి రమేష్ – శైలజ దంపతుల కుమారుడు కృతిమ్ గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోతులు దాడి చేసి గాయ పర్చాయి. గమనించిన తోటి విద్యార్థులు కృతిమ్ కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో అతడిని కుటుంబ సభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా గ్రామంలో కోతుల బెడద అధికంగా ఉందని, అధికారులు స్పందించి కోతులను పట్టి అడవిలో వదిలి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మార్నేని రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ డీసీసీబీ తొర్రూరు బ్రాంచీ కార్యాలయంలో పని చేస్తూ మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రావాల్సిన బెనిఫిట్స్‌ను చైర్మన్ మార్నేని రవీందర్ రావు అందజేశారు. గురువారం హనుమకొండలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో తొర్రూరు డీసీసీబీ బ్రాంచీలో పని చేస్తున్న ఉద్యోగి జితేందర్ అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయనకు వెళ్లాల్సిన బెనిఫిట్స్ రూ.6,17,000 విలువ కలిగిన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ చిన్నారావు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వృద్ధుడు మృతి



రాజేశం (ఫైల్)

హసన్‌పర్తి: చెరువులో ఈత కొట్టడానికి తాత మనవళ్లు వెళ్లగా.. ప్రమాదవశాత్తు తాత ఈత కొడుతూ మునిగి పోయాడు. ఈ ఘటన గురువారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కేయూ–1 ప్రాంతానికి చెందిన యాంసాని రాజేశం (72) బుధవారం తన మనవడు అక్షిత్‌తో కలిసి రెడ్డిపురం సమీపంలోని ఓ చెరువులో ఈతకు వెళ్లారు. అక్షిత్ ఒడ్డుకు ఉండగా రాజేశం చెరువులో ఈత కొడుతూ కనిపించకుండా పోయాడు. గమనించిన అక్షిత్ డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈత గాళ్ల సాయంతో గాలించినా ఫలితం లేకపోయింది. గురువారం రాజేశం మృతదేహం చెరువులో తేలుతూ కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు, బంధువులు చెరువు వద్దకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.


డోర్నకల్‌లో..

డోర్నకల్: డోర్నకల్ పోలీస్‌స్టేషన్ పరిధి సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ శివారులోని ఊరకుంటలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి జారి పడి మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్నెగూడెంకు చెందిన దుగ్గినేని మురళి (47) గురువారం గ్రామ సమీపంలోని ఊరకుంటలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య సరోజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మురళి ఈతకు వెళ్లి మృతి చెంది ఉంటాడని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

టవర్ పైనుంచి పడి వ్యక్తి..

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యుత్ హైటెన్షన్ టవర్ పైనుంచి ప్రమాదవశాత్తు పడి అంజాద్ అలీ (22) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన అంజాద్‌అలీ, అతని తండ్రి జియాహుల్ హక్‌తో పాటు మరికొందరు మండలంలోని పాంనూర్‌లో విద్యుత్ హైటెన్షన్ లైన్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం పనులు చేస్తున్న క్రమంలో హైటెన్షన్ టవర్‌పై నుంచి ప్రమాదవశాత్తు అంజాద్‌అలీ జారి పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు.

గుండెపోటుతో బీఆర్‌ఎస్ నాయకుడి..



ఆంజనేయులు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ చిగురు సరిత భర్త, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు చిగురు ఆంజనేయులు (46) గుండెపోటుతో గురువారం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. శివునిపల్లిలో ఓ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో ఒంటిలో కాస్త నలతగా ఉందని ఇంటికి వెళ్లాడు. ఇంట్లోకి వెళ్లే క్రమంలో గడప కాలికి తగిలి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన ఆంజనేయులు కుమార్తె తల్లికి సమాచారం అందించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య ఆంజనేయులు ఇంటికి చేరుకుని చెతస్కోప్‌తో పరీక్షించారు. ఎమ్మెల్యే వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, బీఆర్‌ఎస్ నాయకులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

హరిభూషణ్ పేరుతో పైసలు వసూల్

- ముగ్గురు మాజీలతో పాటు మరో వ్యక్తి అరెస్ట్
- రూ.1.20 లక్షల నగదు, ఎయిర్‌పిస్టల్, నాలుగు సెల్‌ఫోన్లు, 2 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు



నకిలీ మావోయిస్టులను చూపి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, చిత్రంలో పోలీస్ అధికారులు

బయ్యారం: మావోయిస్ట్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిభూషణ్ పేరుతో బలవంతపు వసూళ్లు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను గురువారం మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన దళ కమాండర్ ముత్తయ్య అలియాస్ ఆజాద్, బయ్యారం గ్రామానికి చెందిన మాజీ నక్సలైట్ పనుల లింగయ్య అలియాస్ లింగన్న, ఖమ్మం పట్టణం బల్లేపల్లికి చెందిన బత్తుల రామకృష్ణ, బయ్యారానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన ఆర్గనైజర్ నిమ్మల లింగయ్యలు ఒక ముఠాగా ఏర్పడ్డారు. బయ్యారం మండలంలో గతంలో నక్సల్స్ కార్యకలాపాలు కొనసాగడాన్ని ఆసరాగా చేసుకున్న వీరు అమాయకులను టార్గెట్‌గా చేసుకొని వసూళ్లకు తెరలేపారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇల్లందు నుంచి కొత్తపేటలోని తన వ్యవసాయభూమి వద్దకు వచ్చిన వ్యాపారి యాదగిరిరెడ్డిని ఎయిర్‌గన్‌తో బెదిరించి మాజీ మావోయిస్ట్ హరిభూషణ్ పంపించారని రూ.20 లక్షలు డిమాండ్ చేశారు. అతను డబ్బులు ఇవ్వకపోవటంతో కిడ్నాప్ చేశారు. తరువాత రూ.1.20 లక్షలు ఇవ్వగా విడుదల చేశారు. ఈక్రమంలో బయ్యారంలో సీసీఎస్, స్థానిక పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు బైక్‌లపై నలుగురు అనుమానాస్పదంగా వెళ్తూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా మావోయిస్టుల పేరుతో వసూళ్లకు పాల్పడినట్లు బయటపడింది. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ రమణబాబు తెలిపారు. బయ్యారం మండలంలో మావోయిస్టులు, ఇతర నక్సల్స్ కార్యకలాపాలు లేవని, నక్సల్స్ పేరుతో ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. నకిలీ నక్సలైట్లను పట్టుకున్న సీసీఎస్ సీఐ మోహన్, గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, సీసీఎస్ ఎస్ఐ రామారావు, బయ్యారం ఎస్ఐ రమాదేవి, సీసీఎస్ ఏఎస్ఐ పాపయ్య, కానిస్టేబుల్స్ రాజశేఖర్, విజయ్, బాలు, సుమన్, హోంగార్డు మధుసూదన్‌రెడ్డిలను అభినందించి రివార్డులు అందజేశారు.